# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 12 । డిసెంబర్ । 2024






**'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ'ని జయప్రదం చేయండి**

'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో



**భగవద్గీత పఠనంతో జీవితం ఆదర్శవంతం**

భగవద్గీత పఠనం ద్వారా మనిషి జీవితం ఆదర్శవంతవుతుందని సరస్వతి మాతాజీ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.0 /23.6

**వాతావరణం**

జిల్లాలో బుధవారం 23.6 - 31.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.61 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

## న్యూస్‌రీల్

### జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బదిలీ

**కడప సెవెన్‌రోడ్స్ :** జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా పనిచేస్తున్న కె.వెంకట్రావుకు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ అమరావతిలోని ఏపీ సెక్రటేరియేట్ (ప్లానింగ్ శాఖ)కు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రణాళికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్ (ఎఫ్‌ఏసీ) పీయూష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న హజరతయ్యను ఇన్‌ఛార్జి సీపీఓగా నియమించారు.

### జర్నలిస్ట్‌లపై దాడి హేయమైన చర్య

**కడప కార్పొరేషన్ :** హైదరాబాద్‌లో సినీనటుడు మోహన్‌బాబు, తిరుపతిలో మోహన్ బాబు సహాయకులు జర్నలిస్టులపై చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి పి. రామసుబ్బారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మంచు కుటుంబంలో జరుగుతున్న వ్యవహారాలను కవరేజ్ చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై దాడిచేసిన మోహన్ బాబు పైన , అతని సహాయకులపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్ట్ పై దాడి చేయడం సరికాదన్నారు. మీడియా స్వేచ్ఛకు ఎవరు భంగం కలిగించినా ఉపేక్షించరాదని చెప్పారు.

### విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు పటిష్ట చర్యలు

**కడప కార్పొరేషన్ :** విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎస్‌పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్ధన్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విజిలెన్స్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు విధిగా దాడులు నిర్వహించాలని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు. అనంతరం అధికారులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ పి.నరసింహారెడ్డి, సబ్ ఎస్‌ఐలు ఎం.మధుసూదన్ రెడ్డి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### 'కుడా' చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న రూపానందరెడ్డి

**కడప రూరల్ :** రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి కుడా (కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో రూపానందరెడ్డితో జేసీ అదితిసింగ్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ కడప పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రయ్య, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, అరవ శ్రీధర్, రాష్ట్ర ఖాదీ బోర్డ్ చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### తెగుళ్లతో పంటకు నష్టం..



నాపేరు తాడిగొట్ల శ్రీనివాసులు రెడ్డి. మాది వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామం. నేను వర్షాధారం కింద 3.5 ఎకరాల్లో బుడ్డ శనగ సాగు చేశాను. ఇప్పటికే ఎకరాకు సుమారు 20 వేల రూపాయలకు పైగా ఖర్చయింది. వర్షం ఎక్కువగా కురవడం వలన నేలలో తేమ అధికంగా ఉంది. దీంతో పల్లపు ప్రాంతాల్లో పంట తెగుళ్లతో చనిపోతోంది. దీంతో మందుల పిచికారికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. మళ్లీ వర్షం వస్తే పంటకు తీవ్ర నష్టం జరుగుతుంది.

### మళ్లీ వర్షాలా..



నాపేరు నగిలి శివరామిరెడ్డి. మాది కమలాపురం మండలం గోపులాపురం. నేను 12 ఎకరాల్లో శనగ పంట సాగు చేశాను. పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. సాగుకు గానూ ఇప్పటికే ఎకరాకు 20 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇపుడు వర్షం వస్తే పూత, పిందె రాలిపోతుంది. తేమ శాతం అధికమై పంట చనిపోయే అవకాశం వుంది. మళ్లీ వానలు అంటే భయంగా ఉంది.



వల్లూరు మండలంలో దెబ్బతిన్న శనగ పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం

వల్లూరు మండలంలోని కొన్ని ప్రాంతాల్లో తెగుళ్లతో శనగ పంట ఎక్కువ భాగం దెబ్బతింది. ఆ పంటను కాపాడుకునేందుకు మందుల పిచికారితో బాటు ఇతర ఖర్చులను భరించలేక పంటను పూర్తిగా ట్రాక్టర్లతో రైతులు దున్నేస్తున్నారు.

**ఇది.. ఈ ఇద్దరి రైతుల ఆందోళనే కాదు.. జిల్లా వ్యాప్తంగా మినుము, బుడ్డశనగ, ఇతర పంటలు సాగు చేసిన అన్నదాతలది.. వాన గండం పొంచి ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతుల్లో వాన భయం పట్టుకుంది.**

# అన్నదాతకు వాన భయం..!



- ఇప్పటికే తేమ శాతం అధికమై శనగ, మినుము పంటలకు ఎక్కువైన తెగుళ్లు
- మళ్లీ వర్షాలు వస్తే పంటలకు తీవ్ర నష్టం
- ఆందోళనలో రైతన్న



మినుము పంటలో తెగుళ్ల నివారణకు ట్రాక్టర్‌తో మందుల పిచికారీ

**వల్లూరు :** ఇటీవల తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు దెబ్బగా మారాయి. కొద్ది రోజులుగా ఆకాశంలో మబ్బులు ఆవరించడంతో బాటు అడపా దడపా కురుస్తున్న వర్షం పంటలు సాగు చేసిన రైతుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తోంది. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు ముఖ్యంగా వర్షాధార పంటలుగా సుమారు రెండు నెలల క్రితం మినుము పంటను సాగు చేశారు. నెల రోజుల క్రితం బుడ్డ శనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేశారు. నీటి పారుదల కింద సైతం మినుము, నూగు పంటలను సాగు చేశారు.

■ జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో మినుము 12,540 హెక్టార్లలో. బుడ్డ శనగ 72,776 హెక్టార్లలో, నువ్వుల పంట 1661 హెక్టార్లలో సాగయింది. ఆ పంటలు ప్రస్తుతం పూత, పిందె దశల్లో వున్నాయి. ఈ దశలో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో పంటలకు తీవ్ర నష్టం కలిగే అవకాశాలు వున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

■ నవంబర్ నెల రెండవ వారంలో అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాల వలన వర్షాధార భూముల్లో తేమ శాతం అధికంగా వుండగా, నవంబర్ చివరి వారంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన వానకు పంటలకు నష్టం కలిగించింది. అయితే మళ్లీ ఇప్పుడు వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో అన్నదాతల్లో వాన భయం పట్టుకుంది.

**తెగుళ్ల ఉధృతి.. పెరిగిన ఖర్చులు..**

వరుసగా కొన్ని రోజుల పాటు ఆకాశం మేఘావృతమై వుండడంతో బాటు వర్షాలు కురిసిన కారణంగా మినుము, బుడ్డ శనగ, నువ్వుల పంటలలో తెగుళ్లు, పురుగుల ఉధృతి భారీగా పెరిగింది. మినుము పంటను బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులు ఆశించగా, బుడ్డ శనగ పంటను వేరు కుళ్లు తెగులు, కాండం కుళ్లు తెగులు, ఎండు తెగుళ్లు ఆశించాయి. దీంతో రైతులు పంటలను కాపాడుకోవడానికి విపరీతంగా పురుగు, తెగుళ్ల మందులను పిచికారి చేయక తప్పడం లేదు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి అల్లాడుతున్న రైతాంగానికి తెగుళ్లు, పురుగుల నుండి పంటలను కాపాడుకోవడానికి మందుల పిచికారికి అదనంగా ఖర్చు చేయాల్సిరావడం మరింత భారంగా మారింది. దానికి తోడు పూత, పిందె రాలిపోయి దిగుబడులపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షం వలన నేలలో అధిక తేమ కారణంగా ముఖ్యంగా బుడ్డ శనగ పంట తెగుళ్లతో పూర్తిగా దెబ్బతిని మొక్కలు చనిపోతున్నాయి.

### ప్రభుత్వం ఆదుకోవాలి..



నేను ఏడు ఎకరాల్లో శనగ పంటను సాగు చేశాను. ఇప్పటికే పంట సాగు, మందుల పిచికారికి ఎకరాకు 22 వేల రూపాయల వరకు ఖర్చు చేశాను. వర్షాలు ఎక్కువ కావడంతో పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో చేసేది లేక పంటను తొలగిస్తున్నాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

- పుత్తా వెంకట సుబ్బారెడ్డి, శనగ రైతు, వల్లూరు మండలం

| జిల్లా వ్యాప్తంగా సాగైన మినుము | సాగైన బుడ్డ శనగ |
|---|---|
| 12,540 హెక్టార్లు | 72,776 హెక్టార్లు |

భూముల్లో పల్లపు ప్రాంతాల్లో ఇప్పటికే శనగ పంట చనిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**మందుల పిచికారీకి అవరోధాలు..**

ఏదో ఒక విధంగా సాగు చేసిన పంటలను రక్షించుకోవడానికి అప్పులు చేసి మందులను పిచికారి చేయడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. అయితే అధిక వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో పొలాలు బురదగా వున్నాయి. దీంతో మందులు పిచికారి చేయడానికి ట్రాక్టర్లు మరి కొద్ది రోజుల పాటు పొలాల్లోకి దిగలేని పరిస్థితులు వుండడంతో ఏమి చేయాలో పాలు పోక రైతులు అవస్థలు పడుతున్నారు. అలస్యమైతే పురుగులు, తెగుళ్ల ఉధృతి వలన పంటలకు రోజు రోజుకూ నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

■ కాగా ఈ నెలలో వాయుగుండాల ముప్పు వుందని వాతావరణ విభాగం ప్రకటించిన నేపథ్యంలో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఈ నెల మూడవ వారం వరకు అల్పపీడనాలు ఏర్పడనున్నాయని వాతావరణ విభాగం ప్రకటిస్తున్న నేపథ్యంలో మళ్లీ వర్షాలు కురిస్తే పంటలను వదులుకోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## పదిహేనో ఆర్థిక సంఘ నిధులపై పేచీ

- వీధి దీపాలు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు ఈ నిధుల్లోంచి ఇచ్చేందుకు కార్పొరేటర్లు ససేమిరా
- మీరు తీర్మాణం చేసినా, చేయక పోయినా ప్రభుత్వానికి పంపుతానన్న కమిషనర్
- సమావేశాన్ని బహిష్కరించిన కార్పొరేటర్లు

**కడప కార్పొరేషన్ :** కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల మధ్య ఎటూ పొసగని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కడపలో పర్యటించిన సందర్భంలో… నగరంలో నాలుగైదు రోజులకొకసారి తాగు నీరు వస్తున్నాయని ఎమ్మెల్యే మాధవి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ నగరంలో రోజు మార్చి రోజు తాగునీరిస్తున్నామని, అలా ఇస్తున్నారో లేదో చెప్పాలని ఈనెల 9వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పట్టుబట్టారు. అయితే కమిషనర్ ఇక్కడ అర్జీలు మాత్రమే స్వీకరిస్తానని, మీ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం కుదరని ఖరాఖండిగా చెప్పారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన రూ.14 కోట్లలో రూ.4కోట్లను గతంలో ఎల్ఈడీ వీధి దీపాలను సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని కమిషనర్ తెలుపగా, ఇందుకు కార్పొరేటర్లు అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్ మార్కెట్ ధరలకంటే ఎక్కువ ధరలకు ఎల్ఈడీ దీపాలు సరఫరా చేశారని, అగ్రిమెంట్ ప్రకారం వీధి దీపాల నిర్వహణ చేపట్టలేదని గుర్తు చేశారు. అంతగా ఇవ్వాలంటే జనరల్ ఫండ్ నుంచి ఇవ్వాలే తప్పా 15వ ఆర్థిక సంఘ నిధుల్లోంచి ఇవ్వడం కుదరదని కార్పొరేటర్లు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కమిషనర్, కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. దీంతో కమిషనర్ మీరు తీర్మాణం చేసినా, చేయక పోయినా తాను చేసేది చేస్తానని చెప్పడంతో కార్పొరేటర్లు ఖంగుతిన్నట్లు తెలుస్తోంది. ప్రజలచే ఎన్నికైన కార్పొరేటర్ల పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా వారి తీర్మాణాల పట్ల కమిషనర్ చులకన భావంతో వ్యవహరించడం మంచిది కాదని పేర్కొంటూ సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిసింది.

## గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు కోటిరెడ్డి దంపతులు

- ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవీరెడ్డి





కోటిరెడ్డి, రామసుబ్బమ్మల కాంస్యవిగ్రహం వద్ద కోటిరెడ్డి వారసులు (ఇన్‌సెట్) కాంస్య విగ్రహాల వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, కోటిరెడ్డి కుమారులు

**వైవీయూ :** గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు కోటిరెడ్డి దంపతులు అని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవీరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా కడప కోటిరెడ్డి, రామసుబ్బమ్మల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరంలో ఉద్యమించిన గొప్ప నాయకుడు కోటిరెడ్డి అన్నారు. అలాంటి గొప్ప నాయకుడి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. మహిళా విద్యకోసం, మహిళా అభ్యున్నతి కోసం కృషిచేయడంతో పాటు మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణానికి వారు సంపూర్ణంగా సహకారం అందించారన్నారు. వారి దాతృత్వాన్ని వారి వారసులు సైతం కొనసాగిస్తుండటం గొప్ప విషయమన్నారు.

కోటిరెడ్డి కుమారులు ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కె. జయభారత్‌రెడ్డి, డాక్టర్ సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడుతూ తామంతా తల్లిదండ్రులు స్థాపించిన కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కళాశాలలో ప్రతిభావంతులైన విద్యార్థినులకు కోటిరెడ్డి జయంతి సందర్భంగా మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే 20 మంది పేద విద్యార్థినులకు అయ్యే ఖర్చును చెల్లిస్తామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా మాట్లాడుతూ కళాశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా కోటిరెడ్డి వారసుల చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కోటిరెడ్డి కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. అనంతరం కోటిరెడ్డి వారసులు వారి కుటుంబ నేపథ్యం గురించి వివరించారు. చరిత్ర పరిశోధకులు ఆచార్య జి. సాంబశివారెడ్డి, డాక్టర్ బాలగొండ గంగాధర్‌లు కోటిరెడ్డి జీవిత విశేషాలను వివరించారు. అనంతరం కోటిరెడ్డి జీవితచరిత్రపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోటిరెడ్డి వారసులు సుచరిత, పద్మావతమ్మ, హర్షవర్ధన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, అశోక్‌రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్



**నేడు 141వ వర్ధంతి**

**కడప కల్చరల్ :** తెలుగు వారికి బ్రౌన్ ఆరాధనీయుడు. తెలుగు వారికి ప్రతిష్టాత్మకమైన ప్రబంధాలు, కావ్యాలు, పురాణ ఇతిహాసాలతోపాటు విశ్వకవిగా వేమనను కాలానికి విలువైన కానుకగా అందజేసిన మహానీయుడు. జీవితాన్ని తెలుగుభాషోద్ధరణకు అంకితం చేశాడు గనుకనే ఆయనంటే తెలుగు వారందరికీ ఆరాధన. తెలుగు వెలుగుకు విశేష కృషి చేసి తెలుగు సూర్యుడిగా వినుతికెక్కారు బ్రౌన్. గురువారం ఆయన 141వ వర్ధంతి. కడపలో ఆయన పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రౌన్ గురించి సాక్షి ప్రత్యేక కథనం.

■ సీపీ బ్రౌన్ 1820 ఆగస్టులో జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉద్యోగ విధులు ప్రారంభించారు. 1824 నుంచి తెలుగు కావ్యాల అధ్యయనం ప్రారంభించి పట్టు సాధించారు. కడపకు వచ్చాకే ఆయనకు తెలుగుభాష గొప్పదనం తెలిసింది. ఈ క్రమంలో ఫ్రెంచ్ గురువు 'అబె దుబయ్' ద్వారా బ్రౌన్ వేమన గురించి ఆయన పద్యాల ఘనతను గురించి తెలుసుకుని మక్కువ పెంచుకున్నాడు. వేమన పద్యాలున్న తాళపత్రాలను సేకరించి స్వంత ఖర్చుతో 1215 పద్యాలను ఆంగ్లంలోకి అనువదించారు. బ్రౌన్ లేకుంటే వేమన నేటి తరం తెలుగు వారికి దక్కేవారు కాదు. ఆయన పద్యాల్లోని తెలుగు పదాలకు అర్థాలు తెలుసుకునే క్రమంలో వాటిని మాలగా కూర్చే క్రమంలో బ్రౌన్ నిఘంటువు రూపుదాల్చింది. జిల్లాపై అభిమానంతో తొలుత దీనికి కడప నిఘంటువుగా పేరు పెట్టారు. తర్వాతే బ్రౌన్ నిఘంటువుగా మారింది. ఆయన కార్యస్థానం గనుక కడప అంటే ఆయనకు ఎనలేని మమకారం.



బ్రౌన్ పేరిట ఏర్పాటైన గ్రంథాలయం

**మానవతా వాది**

బ్రౌన్ కడప నగరంలో రెండు, బందరులో రెండు, మద్రాసులోని ఎగ్మోర్‌లో ఒక పాఠశాల ఏర్పాటు చేశారు. తెలుగుతోపాటు ఉర్దూ, పార్శి నేర్చారు. మన జిల్లాలో ఓమారు 11 మంది దోషులకు రూ. 355 జరిమాన విధించగా తానే చెల్లించి వారిని విడుదల చేయించారు. ఒక ఉర్దూ మున్షి అప్పుల్లో ఉండగా రూ. 1000 చెల్లించి రుణ విముక్తుడిని చేశాడు. కరువు సమయాల్లో గంజి కేంద్రాలను ఏర్పాటు చేశాడు. ఆయన గుంటూరుకు బదిలీ అయ్యాక ఇక్కడ కరువు వచ్చిందని తెలిసి తన సహాయకుడు కృష్ణారెడ్డికి గంజి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వికలాంగులు, అంధులు, నిరుపేదలు, అనాథలు, వృద్ధులకు ధర్మ భోజనం పేరుతో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. పూట కూళ్ల సత్రాలకు ప్రతినెలా తానే బిల్లు చెల్లించాడు. పాతకడప ప్రాంతంలో సతీ సహగమనం జరుగుతున్న విషయం తెలిసి కారకుడైన వ్యక్తిని బ్రౌన్ తన అదుపులో ఉంచుకున్నాడు. ఫలితంగా మృతదేహంతోపాటు ఆయన భార్యను కాల్చేయకుండా కాపాడగలిగారు.

**బ్రౌన్ చిత్ర రూపకర్త**

బ్రౌన్ చిత్రం అవసరాన్ని గుర్తించిన డాక్టర్ జానమద్ది ఆయన ఫోటో కోసం లండన్‌లో కూడా వెతికారు. అది లభించకపోవడంతో ప్రముఖ చిత్రకారుడు తన మిత్రుడు మైనంపాటి సుబ్రమణ్యం ద్వారా 1991లో బ్రౌన్ ఊహా చిత్రాన్ని రూపొందింపజేసి తెలుగు సాహితీ లోకానికి అపూర్వమైన కానుకగా అందజేశారు. ప్రస్తుతం బ్రౌన్‌గా ప్రచారంలో ఉన్నది లలిత కళానిధి మైనంపాటి గీసిన చిత్రమే! బ్రౌన్ గ్రంథాలయం వెలుపల గోడపై నేడు కనిపిస్తున్న బ్రౌన్ కుడ్య చిత్రం జిల్లాకు చెందిన చిత్ర, శిల్పకారుడు గొల్లపల్లి జయన్న రూపొందించారు. ఈ గ్రంథాలయమే రాష్ట్రంలో ఓ అపురూపమైన సరస్వతీ నిలయంగా పేరుగాంచింది.

**బ్రౌన్ జీవితంలో ముఖ్య ఘట్టాలు**

- ■ 1798లో జన్మించారు.
- ■ 1816లో మద్రాసు సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగిగా చేరారు.
- ■ 1817 మద్రాసు ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాలలో తెలుగు అధ్యయనం ప్రారంభించారు.
- ■ 1821 కడపలో తెలుగు, హిందూస్తానీలను ఉచితంగా బోధించేందుకు రెండు పాఠశాలలు ప్రారంభించారు.
- ■ 1824 అబె దుబాయ్ రచన ద్వారా వేమన గురించి తెలుసుకున్నారు.
- ■ 1828 కడపలో బంగ్లా కొన్నారు.
- ■ 1829 వేమన పద్యాల ముద్రణ ప్రారంభించారు.
- ■ 1844లో బ్రౌన్ నిఘంటువు ముద్రణ ప్రారంభం.
- ■ 1854లో ఉద్యోగానికి రాజీనామా చేశారు.
- ■ 1884లో వీలునామా రాశారు. అదే సంవత్సరం డిసెంబరు 12న ఆయన మరణించారు.

**నేడు 'బ్రౌన్' వర్ధంతి సభ**

తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 141వ వర్ధంతి సభను గురువారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఉదయం 9.40 గంటలకు రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి పూలమాల అలంకరిస్తామన్నారు. అనంతరం బ్రౌన్ గ్రంథాలయంలో జరగనున్న సభకు వైవీయూ ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారన్నారు.

## శ్రీనివాస గోవిందా.. వేంకటేశా గోవిందా..

**కడప కల్చరల్ :** 'గోవిందా…హరి గోవిందా…శ్రీనివాస గోవిందా…వేంకటేశా గోవిందా….' అంటూ భక్తుల నామ సంకీర్తనలతో ఆ ప్రాంతం హోరెత్తింది. గోవింద మాల ధరించిన భక్తులతో ఆ ప్రాంగణమంతా పసుపు ఆరబోసినట్లు మంగళకరంగా మారింది. మామిడాకుల తోరణాలు, అరటి పిలకల ఆహ్వానం , వేదికపై నిండుగా అలంకరించిన పూలు వెదజల్లే సౌరభాలు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవ వైభవాన్ని చాటి చెప్పాయి.

కడప నగరానికి చెందిన గోవిందమాల భక్త బృందం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు ఉదయం గో పూజతో ఆరంభించి సుప్రభాతం , విశ్వరూప దర్శనం, ఆహ్వానం, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ మూర్తులకు నవకలశ స్నపన తిరుమంజనం, విశేష అలంకారం నిర్వహించారు. మహా మంగళ సూత్రాలను భక్తులకు దర్శింపజేసి గోవిందనామ స్మరణ మధ్య ఉత్సవ మూర్తులను వేదికపై కొలువుదీర్చారు. కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులందరికీ నిర్వాహకులు స్వామి ప్రసాదం, ముత్యాల తలంబ్రాలు అందజేశారు.



మహా మంగళ సూత్రాలను భక్తులకు దర్శింపజేస్తున్న అర్చకులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

## క్లుప్తంగా

### లారీ సీజ్.. పోలీస్ స్టేషన్‌లో అప్పగింత

అట్లూరు : అధిక లోడుతో వెళుతున్న లారీని సీజ్ చేసి స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ రామ కృష్ణ తెలిపారు. వివరాలిలా.. కడప డిప్యూటీ ట్రాన్సుపోర్టు అధికారి (ఎంవీఐ)వై.ప్రసాద్ కడప–బద్వేలు ప్రధాన రహదారిపై బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా అధిక లోడ్‌తో వెళుతున్న లారీని సీజ్ చేశారు. సంబంధిత లారీకి కడప ట్రాన్సుపోర్టు కార్యాలయంలో జరిమానా చెల్లించి రిలీజ్ ఆర్డర్ తెచ్చుకుని విడిపించుకుని వెళ్లాలని ఆయన సూచించారు.

### ఏఎల్ కాలనీలో వ్యక్తి ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఏఎల్ కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న యూసఫ్ బాష (35) అనే వ్యక్తి బాడుగకు ఉంటున్న ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు చింతకొమ్మదిన్నె పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడు చాలారోజులుగా ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. పూర్తి వివరాల కోసం విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని దొరసానిపల్లెలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగి గోపాల్ ఇంట్లో చోరీ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోపాల్ రైల్వేశాఖలో జీఈగా పని చేస్తూ రిటైర్డ్ అయ్యారు. ఆయన దొరసానిపల్లెలో నివాసం ఉంటున్నారు. వారి సొంత బంధువు ఒకరు చనిపోతే ఈ నెల 6న రాత్రి కడపకు వెళ్లారు. అక్కడి కార్యక్రమాలన్నీ ముగించుకొని బుధవారం ఉదయం గోపాల్ దొరసానిపల్లెకు వచ్చారు. ఆయన వచ్చే సరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసుకోగా బీరువాలో ఉన్న వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి గోపాల్ ఇంటిని పరిశీలించారు. సుమారు 7 తులాల బంగారు నగలు, 500 గ్రాములు వెండి చోరీకి గురైనట్లు గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం అధికారులు సంఘటనా స్థలంలో వేలి ముద్రలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### విజిలెన్స్ అధికారుల దాడులు

– 152 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

కడప అర్బన్ : కడప రీజనల్ విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు, కడప ఏఎస్ఓ లతో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా చెన్నూరు మండలం వేదాస్ స్కూలు నుంచి గోపవరం గ్రామానికి వెళ్లే రోడ్డులో గల రేకుల షెడ్డు వద్ద, చెన్నూరు గ్రామము వనమ్ వీధికి చెందిన కాటం నిరంజన్ కుమార్, కాటం వీర బ్రహ్మయ్య అనే వ్యక్తులు పీడీఎస్ బియ్యం సేకరించారు. అక్రమంగా నిల్వ ఉంచి రవాణాకు సిద్ధంగా ఉంచారన్న సమాచారం మేరకు అధికారులు తనిఖీ చేశారు. 152 బస్తాలు, 7504 కేజీల బరువు కలిగిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారులు డీఈఈ జవహర్ రెడ్డి, ఏఓ బాలగంగాధర రెడ్డి పాల్గొన్నారు.

### దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప అర్బన్ : కడప నగరంలోని టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చిలకలబావి వద్ద గతనెల 16వ తేదీన అరఫాత్‌ను ఇలియాస్, సలీం, బన్ని, తాజ్ అనే వారు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు అరఫాత్ ఫిర్యాదు మేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని బుధవారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు కడప టుటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

## ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’

# జయప్రదం చేయండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపు
- ఈనెల 13న భారీ ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం



అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నపూర్ణగా పేరొందిన ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఎన్నికల ముందు రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామని, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆదే సీజన్‌లో పరిహారం అందించామని, రైతులు విత్తనాలు నాటడం మొదలుకొని పంట నూర్పి, గిట్టుబాటు ధర కల్పించేవరకూ అండగా ఉన్నామన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంట నష్టపోయిన రైతులకు ఇన్స్యూరెన్స్ వచ్చేవరకూ అండగా ఉన్నామన్నారు. 2వేల జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఏ అవసరం వచ్చినా ఆదుకున్నామన్నారు. ప్రస్తుతం వర్షాల వల్ల ఖరీఫ్, రబీలో రైతులు నష్టపోయినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మద్దతు ధర అసలే లేదని, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారన్నారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా ముద్ర వేసుకున్నారన్నారు. తాము ఎన్నికల్లో రైతులకు ఏడాదికి రూ.12వేలు మాత్రమే ఇస్తామని చెప్పినా, రూ.1500 పెంచి రూ.13500 చొప్పున ఐదేళ్లు అందించామన్నారు. చంద్రబాబుకు రైతులంటే గిట్టదని, వ్యవసాయం దండగ అని ఆయన అభిప్రాయమన్నారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని కోరుకున్నది దివంగత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి అందించి, ఏకకాలంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వైఎస్సార్ రైతు బాంధవుడిగా నిలిచిపోయారన్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక గండికోట ముంపు వాసులకు రూ.1000కోట్ల పరిహారం ఇచ్చి గండికోటలో 26 టీఎంసీలు నిల్వ చేశారన్నారు. గతంలో పుట్టి వడ్లు రూ.16వేలు ఉంటే, ఇప్పుడు రూ.10వేలకు పడిపోయిందన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు ఈ ప్రభుత్వం పేర్లు మార్చి అమలు చేస్తోందన్నారు. సమస్యలపై ఈనెల 13వ తేది ఉదయం 10 గంటలకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌ను కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నాయకులు పులి సునీల్‌కుమార్, యల్లారెడ్డి, షఫీ, అహ్మద్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం కావాలి

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రైతులను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిఒక్కరు సిద్ధం కావాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 13న జరగనున్న రైతు సమస్యలపై ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకుగాను బద్వేలు మున్సిపాలిటీ, బద్వేలు రూరల్, గోపవరం, అట్లూరు మండలాల ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలు అవుతున్నా రైతాంగానికి ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 13న కడప కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు మల్లేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, పుల్లయ్య, ఆయా మండలాల నాయకులు, వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## అలవాటులేని ఆహారంతోనే

# విద్యార్థులకు అస్వస్థత

ట్రిపుల్ ఐటీని సందర్శించిన అధికారులు



ట్రిపుల్ ఐటీ అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిత

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్ కాలేదని, అలవాటులేని ఆహారం తినడంవలనే కొంత మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, ఇన్‌చార్జ్ ఆర్డీఓ చిన్నయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని పత్రికల్లో రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను బుధవారం జిల్లా ఆరోగ్య శాఖ వైద్యాధికారి నాగరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత, ఇన్‌చార్జి ఆర్డీఓ చిన్నయ్య సందర్శించారు. అలాగే ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఉన్న ఆసుపత్రికి వెళ్లి గత 5 రోజులుగా జరిగిన ఓపీకి చెందిన రికార్డులను పరిశీలించి అక్కడ ఉన్న వైద్యులు ప్రభాకర్ రెడ్డి, సంతోష్ కుమార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఒంగోలు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల విద్యార్థులను కూడా కలిసి భోజనానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇచ్చిన సమాచారం మేరకు ఆహారంలో ఎలాంటి కలుషితం కాలేదన్నారు. గత 5రోజులుగా 33 మంది విద్యార్థులు వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చారన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్న ఆసుపత్రిలో ఐదుగురు వైద్యులు 24 గంటలు పని చేస్తున్నారన్నారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థులకు ఇక్కడి ఆహారం, వంట పడకపోవడంతోపాటు కడప మసాలాలతో మాకు ఎక్కువగా వాంతులు చేసుకున్నట్లు విద్యార్థులు తమ దృష్టికి తెచ్చారన్నారు. కార్యక్రమంలోతహసీల్దార్ హరినాథ్ రెడ్డి, అసిస్టెంట్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట రెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర రాజు, డాక్టర్ ఖాజా మొద్దీన్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

### రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఊటుకూరు గోపాల్ పాల్యూషన్ సెంటర్ వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు రోడ్డు దాటే క్రమంలో ఢీకొన్నాయి. ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు గాయపడ్డారు. గాయలైనవారిలో ఒకరైన వ్యవసాయశాఖ డాట్ సెంటర్ ఉద్యోగి పూర్ణచంద్ర. అతడిని చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. మరొకరు స్థానిక చెర్లోపల్లి నివాసి మహమ్మద్ రఫీ అని తెలిసింది. అతడిని వైద్య చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

### రైల్వే స్టేషన్‌లో వృద్ధురాలి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిందని రైల్వే పోలీసులు తెలిపారు. స్టేషన్‌లోని మూడవ ప్లాట్‌ఫాం పడమరవైపున వృద్ధురాలి తల పగిలి రక్తగాయంతో మృతి చెందినట్లు స్పష్టమవుతోందన్నారు. మృతురాలి కుడి చేయి ఫ్యాక్చర్ కావడంతో కట్టు కట్టిఉ న్నట్లు ఉందని వివరించారు. అలాగే మృతురాలు పసుపు చీర, ఎరువు రంగు జాకెట్ ధరించి ఉందని, ఎడమ చేతిపై పూలతో కూడి పచ్చబొట్టు, మెడలో డిస్కో పూసల దండ, కాళ్లకు వెండి మెట్టలు ఉన్నాయన్నారు. మృతురాలిని గుర్తిస్తే కడప రైల్వే ఎస్ఐ (సెల్ నెం.94409 000811)కు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.



## భగవద్గీత పఠనంతో జీవితం ఆదర్శవంతం

- గీతా జయంతి సందర్భంగా సరస్వతి మాతాజీ
- రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



భగవద్గీత పఠన పోటీల్లో విద్యార్థులు

ప్రొద్దుటూరు : భగవద్గీత పఠనం ద్వారా మనిషి జీవితం ఆదర్శవంతవుతుందని స్థానిక శ్రీచిదదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు పూజ్య స్వామిని సరస్వతి మాతాజీ తెలిపారు. పెన్నానది తీరంలోని త్యాగరాజ కల్యాణ మండపంలో బుధవారం గీతా జయంతిని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి భగవద్గీత మొదటి అధ్యాయంలోని అర్జున విషాద యోగ పఠన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ భగవద్గీత పుస్తకం అందరికి అందాలన్నదే ప్రథమ సంకల్పమని అన్నారు. గీతా జ్ఞానం మన కుటుంబ సభ్యులందరికి అందించాలని సూచించారు. భగవద్గీత పోటీల ద్వారా విద్యార్థులకు ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా మనిషి జీవితం ఆదర్శం కావడానికిఇ పునాదులు ఏర్పడుతాయని తెలిపారు. మనిషి ఆదర్శవంతమైన, ఆనందవంతమైన జీవితానికి కావాల్సిన జ్ఞానాన్ని అర్జునుల ద్వారా మనకు అందించారన్నారు.

### 1000 మందితో భగవద్గీత పారాయణం

కల్యాణ మండపం ఆవరణలో దాదాపు 1000 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ట్రస్టు భక్తులు కలసి భగవద్గీత మొదటి అధ్యాయం పారాయణం చేశారు. ఈ కార్యక్రమం అందరినీ అలరించింది. అనంతరం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాతాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

### విజేతలకు బహుమతులు

భగవద్గీత పఠన పోటీల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు జోనల్ స్థాయిలో, జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థు లకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీలకు సంబంధించి గ్రూప్–ఏలో టి.జితిన్, తుషారిక, గ్రూప్–బీలో జి.త్రిషిత, ఆర్.ధన్విత, గ్రూప్–సీలో ఎం.మానస, సి.సంతోష్, గ్రూప్–డీలో ఎస్.వెంకటజయశ్రీ, వై.శ్రీ భావన విజేతలుగా నిలిచారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.6 వేల నగదు బహుమతి, మెమెంటో, మెడల్ అందించారు.

## ఆర్టీసీ కానిస్టేబుల్ ఔదార్యం



వృద్ధుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి

కడప అర్బన్ : సమాజంలో నిత్యం మనం వెళుతున్న దారిలో అనేక సంఘటనలు చూస్తుంటాం. కొందరు అయ్యో పాపం అంటే, కొందరు చూసీచూడనట్లుగా వెళుతుంటారు. కానీ ఆ ఆర్టీసి విజిలెన్స్ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి ఓ వృద్ధుడికి సేవ చేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. కడప ఆర్టీసీ బస్టాండ్ స్కూటర్ స్టాండ్‌లో ఖాజీపేట మండలం తవ్వారుపల్లికి చెందిన లక్ష్మిరెడ్డి (75) అనారోగ్యం, గాయాలతో అస్వస్థతతో పడివుండటంతో గమనించాడు. తనతో పాటు పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, సిబ్బంది సుబ్బరాయుడు, మధు నాయక్, లక్ష్మిరెడ్డిలతో కలిసి వృద్ధుడికి స్నానం చేసి, ఆహారం తినిపించారు. అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. ఇందుకోసం గౌస్ కమ్యూనికేషన్స్ యజమాని కమాల్ బాషా తమ వంతుగా సహరించారు. ఈ దృశ్యాలను చూసి అందరూ వారిని మెచ్చుకున్నారు.

# జిల్లాలో గన్ కల్చర్

- నాగిరెడ్డి అనే వ్యక్తిపై బబ్లూ గన్‌తో బెదిరించి దాడి
- టీడీపీ వర్గానికి చెందిన వారే ఎక్కువగా దాడులకు పాల్పడుతున్నారు
- ప్రొద్దుటూరులో రౌడీషీటర్ హత్యలోనూ టీడీపీ వర్గీయుల పాత్ర
- పెండ్లిమర్రి మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడికి పాల్పడిన టీడీపీ మూకలు

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో కొందరు పోలీసులు వైఫల్యం చెందుతున్నారని కొన్ని సంఘటనల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. తాజాగా పులివెందుల పట్టణంలో ఆటోనగర్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు తుపాకీతో హల్‌చల్ చేసి తుమ్మలపల్లెకు చెందిన కొర్రా నాగిరెడ్డిపై దాడి చేయడం భయానక వాతావరణాన్ని సృష్టించింది. నాగిరెడ్డి తలపై చక్రధర్‌రెడ్డి అలియాస్ బబ్లూ తుపాకీతో ఒక రౌండ్ గాలిలోకి కాల్పులు జరిపినట్లు, అదే తుపాకీతో నాగిరెడ్డి తలపై బాదడంతో గాయాలైనట్లు తెలుస్తోంది. జిల్లాలో లైసెన్సులు లేని తుపాకులను ఎక్కడికి వస్తున్నాయనేది తెలియాల్సి ఉంది. జిల్లాలో కూటమి ప్రభుత్వానికి చెందిన వారిలో ప్రధానంగా టీడీపీ చెందిన వారే దాడులకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలను కలిగిస్తున్నారు. ప్రొద్దుటూరులో రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీ అనే రౌడీషీటర్‌ను హత్య చేసిన సంఘటనలో టీడీపీ వర్గానికి చెందిన ముక్తియార్ సోదరుడు ముజీబ్, లోకేశ్వర్ రెడ్డిలు నిందితులుగా ఉన్నారు. ఈ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పెండ్లిమర్రి మండలం గోపరాజుపల్లెకు చెందిన నంద్యాల సుబ్బరాయుడు అనే వ్యక్తి వైఎస్సార్ సీపీ పార్టీలో చురుగ్గా పాల్గొంటున్నాడనే అక్కసుతో టీడీపీ మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇలాంటి సంఘటనలు టీడీపీ వర్గీయుల ద్వారా జరుగుతుంటే పోలీసులు మాత్రం ఇవేమి తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నామమాత్రం చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

మూడవరోజు రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 145 వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో నిరసనలు కొనసాగుతున్నాయి. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గురప్ప నాయుడు ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం రిలేనిరాహార దీక్షలు కొనసాగించారు. కడప నుంచి తిరుపతికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టును బదిలీ చేయడంపై న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఆర్థికంగా బలహీనవర్గాలకు న్యాయసేవలు అందుబాటులో లేకుండా పోతాయని, అనేకమంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బి.గురప్ప నాయుడు ఈ ఉద్యమానికి మద్దతు తెలుపుతూ, ప్రభుత్వం స్పందించకపోతే దీక్షలు ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల న్యాయ ప్రవేశానికి మద్దతు తెలుపుతూ, న్యాయవాదుల చేపట్టిన నిరసనకు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. న్యాయవాదులు సంపత్ కుమార్, రామకొండయ్య, చిన్నయ్య, బీఎస్ అక్బర్ అలీఖాన్, భువన ఏకాదశ రెడ్డి, మంజునాథ్, మదన్ మోహన్ రెడ్డి, ఉదయ్ కుమార్‌లు దీక్షలో పాల్గొన్నారు.

## విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి



మాట్లాడుతున్న బాలకాశి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాలకాశి డిమాండ్ చేశారు. బుధవారం విద్యుత్ రంగం ప్రైవేటీకరణ ఉద్యోగుల సమస్యలపై నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగ ప్రైవేటీకరణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెను మార్పులకు శ్రీకారం చుడుతున్నాయని, ఈ రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పేటందుకు అడుగులు వేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లు తీసుకురావడం జరిగిందన్నారు. త్వరలో గృహాలకు కూడా తీసుకురావడం జరుగుతుందన్నారు. మనిషికి కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం ఎంత ముఖ్యమో అదే స్థాయిలో విద్యుత్ అనేది కూడా దైనందిన జీవితంలో ముఖ్యమైనదన్నారు. అలాంటి నిత్య అవసరమైన విద్యుత్‌ను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తే ప్రజలతో పాటు దేశ భద్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు. పాలక ప్రభుత్వాలు రోజురోజుకు ఉద్యోగుల సంఖ్య కుదించకపోతున్న కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టడంలేదన్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని వారందరినీ క్రమబద్ధీకరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎనర్జీ అసిస్టెంట్లను రెంటికి చెడ్డ రేవడి లాగా గత ప్రభుత్వం నియమించిందని, వారందరినీ కూడా విద్యుత్ సంస్థలో విలీనం చేసి నూతన సర్వీస్ రూల్స్‌ను రద్దుపరిచి పాత సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. విద్యుత్ రంగంలో గుర్తింపు సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామలింగారెడ్డి, శివయ్య, నాగసుబ్బారెడ్డి, కే మల్లికార్జునరెడ్డి సురేష్, లక్ష్మీనారాయణ కే బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్ రెడ్డి, కొండా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

తండ్రికి గాయాలు



వినోద్ కుమార్‌రెడ్డి (ఫైల్)

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని మైదుకూరు – బద్వేలు గడ్డంవారిపల్లె వద్ద బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని అంకిరెడ్డిపల్లె వినోద్‌కుమార్‌రెడ్డి (22) అనే యువకుడు మృతి చెందాడు. సంఘటనలో మృతుడి తండ్రి వెంకట రమణారెడ్డికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉప్పుగుంటపల్లెకు చెందిన అంకిరెడ్డిపల్లె వెంకటరమణారెడ్డి కొంత కాలంగా జీవీ సత్రం సమీపంలోని లక్ష్మీనారాయణపురం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ పోషణ కోసం లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న ఆయన బుధవారం ఉదయం కుమారుడు వినోద్ కుమార్ రెడ్డితో కలిసి బైక్‌పై మైదుకూరుకు బయల్దేరాడు. గడ్డంవారిపల్లె వద్దకు రాగానే బద్వేలు వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. సంఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న వినోద్ కుమార్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న వెంకటరమణారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనలో మృతి చెందిన వినోద్ కుమార్‌రెడ్డి బీటెక్ చదువుకొని ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. అతనికి పాలిటెక్నిక్ చదువుతున్న రవికుమార్ రెడ్డి అనే సోదరుడు ఉన్నాడు. మైదుకూరు అర్బన్ పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

## స్కిల్ డిజైర్ టెక్నాలజీస్‌తో వైవీయూ ఒప్పందం



ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం విద్యార్థుల ప్రయోజనార్థం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి వెల్లడించారు. కడప యోగివేమన విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) కుదుర్చుకున్నారు. విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె. కృష్ణా రెడ్డి సమక్షంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, స్కిల్ డిజైర్ సంస్థ సంచాలకులు శ్రీకాంత్ ముప్పాళ్ళ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తారన్నారు. మద్రాస్ ఐఐటీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ అనుబంధ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమన్నారు. ఇంజినీరింగ్, ఎంబీఎ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఆర్ట్స్ విద్యార్థులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు రూపకల్పన చేస్తామన్నారు. విద్యార్థులు వారి రెగ్యులర్ కోర్సులు అభ్యసిస్తూనే మిగిలిన సమయాల్లో స్కిల్ డిజైర్ సంస్థ ద్వారా ఉద్యోగ నైపుణ్య ఆధారిత శిక్షణను పొందవచ్చని వివరించారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఇది ప్రయోజనకరమని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్‌లు ఆచార్య ఏజీ దాము, కంకణాల గంగయ్య, నోడల్ ఆఫీసర్ డా.ఎస్.పి.వెంకటరమణ, ఎంసీఏ సహ ఆచార్యులు డా.బి.రెడ్డయ్య, డా.ఎం. శ్రీనివాసరావు, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డా.పి.సరిత పాల్గొన్నారు.

## 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లను 12వ పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అమృతానగర్ ఉర్దూ తెలుగు జెడ్పీహైస్కూల్‌లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జులై నుంచి 12వ పీఆర్‌సీ అమలు కావాల్సి ఉండగా ఇంతవరకు కార్యాచరణ ప్రారంభం కాలేదన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలైనా ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, కరవు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శిరమేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు మండల అధ్యక్షకార్యదర్శులు సుబ్బయ్య, సయ్యద్‌బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.